విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 28, ఏప్రిల్ 2025

నిరుపయోగంగా స్టోరేజ్ ట్యాంక్

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ప్రక్కన పెద్దమ్మ మోరికి సమీపంలో ఉన్నటువంటి స్మాల్ స్టోరేజ్ బ్యాంకు నీరు లేక నిరుపయోగంగా మారింది. ట్యాంకు సమీప కాలనీ కుటుంభాలవారికి నిత్యం నీటి అవసరాలు తీరుస్తూ సౌకర్యవంతంగా ఉన్నటువంటి స్టోరేజ్ ట్యాంకు నీరు లేక పోవడం కారణంగా దుమ్ము ధూళి చెత్త చెదారం నిండి ఉన్నదని. సంబంధిత అధికారులు స్పందించి ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా స్మాల్ స్టోరేజ్ బ్యాంకును వీటితో నింపి కాలనీ ప్రజల నీటి అవసరాలు తీర్చాలని పలువురు పేర్కొంటున్నారు.

నువ్వా మాట్లాడేది..
బుగ్గన కాళ్లు పట్టుకున్న విషయం మరిచావా సర్పంచ్

విశాలాంధ్ర - డోన్ రూరల్ : లిక్కర్ స్కాంలో మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి లాంటి పెద్ద చేపను మరిచారని మీడియా ద్వారా టిడిపి నాయకులు మర్రి రమణ విమర్శించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై స్పందిస్తూ పట్టణంలోని వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు ఆదివారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ డోన్ పట్టణానికి చెందిన ఒక టీడీపీ నాయకుడు రాత్రి ఏదో కలలో వస్తే దాన్ని పొద్దున్నే మీడియా ద్వారా మాట్లాడటం హాస్యస్పందంగా ఉందని ఇప్పుడు అధికారంలో ఉన్నది తెలుగుదేశం పార్టీ అని ఏదైనా ఆధారాలు ఉంటే చట్ట ప్రకారం బయటపెట్టాలని అనవసరంగా మా నాయకునీపై నిందలు మోపితే తగదని, బుగ్గన రాజకీయంలో మచ్చ లేని వ్యక్తిగా ఉన్నారని అలాంటి వ్యక్తిపై బురదజల్లె ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంకో సర్పంచ్ అయితే ఆయన నీతికి నిజాయితీకి నిలువుటద్దంల మాట్లాడుతున్నాడని దొంగ బిల్లులు సృష్టించుకుని గ్రానైట్ వ్యాపారం చేస్తున్న నువ్వా మా నాయకుని గురించి వాట్సప్ గ్రూపుల్లో మాట్లాడేది గత వైసిపి ప్రభుత్వం లో రహస్యంగా మా బుగ్గన కాళ్లు మొక్కిన సంగతి మరిచావా ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ,ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి ,మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ,వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్ ,నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు కరుకుంద హరి ,పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి ,కౌన్సిలర్లు మహేశ్వర రెడ్డి,ఆర్ట్ రమణ, నాగేంద్ర మూర్తి,కుమ్మరి రాజు,వైఎస్ఆర్ సీపీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

గాలి, వాన బీభత్సం

నేలకొరిగిన అరటి, చీని, మామిడి తోటలు
తడిసిన మొక్కజొన్న ధాన్యం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల వ్యాప్తంగా గాలివాన ఆదివారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. బీకర గాలుల దాటికి పండ్ల తోటలు నేలకొరిగాయి. కలాలలో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయింది. భారీ గాలులతోపాటు ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం ఆయా గ్రామాలలో కురిసింది. అరటి చీని మామిడి మొక్కజొన్న పంటలను సాగుచేసిన రైతన్నలకు అకాల వర్షాం కన్నీటిని మిగిల్చాయి. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల పరిధిలో 300 ఎకరాలకు పైగా పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. మదనంతపురం ఒక గ్రామంలోని దాదాపు 60 ఎకరాలలో అరటి నేలకొరిగింది. అమ్మకానికి సిద్ధంగా ఉండి గెలలతో ఉన్న అరటి చెట్లు బీకర గాలుల దాటికి విరిగిపడ్డాయి. బోరు బావులు కింద సాగు చేసిన మొక్కజొన్న పంట నేలకొరగా, కలాలలో ఆరబోసిన ధాన్యం కూడా తడిసి ముద్దయింది. అకాల వర్షం పంటలు సాగు చేసిన రైతన్నలను కోలుకోని విధంగా దెబ్బతీసింది. చాలావరకు పంట చేతికొస్తున్న దశలో అన్నదాతలను అకాల వర్షం, భీకర గాలులు దెబ్బ తీసాయి.

రేషన్ మాఫియాకు అడ్డా



రేషన్ కొనుగోలు చేస్తామంటూ వీధిలో తిరుగుతున్న మహిళలు..
పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పేదల ఆకలి తీర్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచిత రేషన్ పాటు సబ్సిడీపై సరుకులను అందిస్తున్నది. వీటి కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నది. సక్రమంగా రేషన్ అందించడంతోపాటు వాటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రేషన్ మాఫియా రెచ్చిపోతున్నది. గత కొన్ని సంవత్సరాలుగామూడు పువ్వులు ఆరు కాయలుగా అక్రమ వ్యాపారం సాగుతున్నది. ఒకవైపు ప్రభుత్వం రేషన్ మాఫియా పై ఉక్కు పాదం మోపుతామని చెబుతుంటే క్షేత్రస్థాయిలో మాత్రం యదేక్షగా కొనసాగు తున్నది. అక్రమ రేషన్ మాఫియాకు కొలిమిగుండ్ల మండలం అడ్డగా మారింది. ఇదేమని ప్రశ్నించే అధికారి లేకపోవడంతో వారి ఆగడాలకు అడ్డే కరువైంది. గ్రామాల లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ జరిగిన రోజే మాఫియా మనుషులు వాలిపో తున్నారు. రేషన్ కోసం మాఫియా కొందరి మహిళలను కూలీలకు పిలుచు కొని దంద కొనసాగిస్తున్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేస్తామంటూ వీధుల్లో తిరుగుతూ ప్రతి ఇంటి తలుపు తడుతున్నారు. అసలే పేదలు కావడంతో అప్పటికి ఉన్న సమస్యలతోవచ్చిన రేషన్ బియ్యాన్ని వచ్చినట్లే మాఫియాకు విక్రయిస్తున్నారు. సేకరించిన రేషన్ సంచులలో నింపుకొని పకడ్బందీగా ఒకచోట నిలువ ఉంచుతారు. అదే రోజు రాత్రి వాహనాన్ని తీసుకువచ్చి చేరాల్సిన చోటికి తరలిస్తారు. రెండు మూడు గ్రూపులు పోటాపోటీగా రేషన్ కోసంగ్రా మాలను చుట్టుముడుతున్నారు. గతంలో గుట్టుగా సాగే రేషన్ అక్రమ సరఫరా నేడు పబ్లిక్‌గా సాగుతుండడంతో ప్రజలే ఆశ్చర్యపోతున్నారు. రేషన్ బియ్యం కేజీ 10 నుండి 12రూపాయల వరకు కొనుగోలు చేస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ గద్దల్ల మాఫియా వాలిపోతున్నారు. చాలామంది లబ్ధిదారులు రేషన్ క్వాలిటీ లేకపోవడంతోనే రేషన్ తీసుకున్న రోజే దళారులకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు, సంబంధిత అధికారులకు తెలియకుండా రేషన్ మాఫియా గ్రామాలలో అడుగుపెట్టగలద అన్నది కూడా ప్రశ్నార్ధకమే. ఏదేమైనా రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా మంత్రి ఎన్ఎండి ఫరూక్ , మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి , నంద్యాల టీడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ రైతులకు వ్యవసాయ పనిముట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు. అనంతరం గోస్పాడు, నంద్యాల రైతులకు విత్తనపు గొర్రు, రోటవేటర్లు తైవాన్ స్ప్రేయర్లు ,బ్యాటరీ స్ప్రేయర్లు కల్టివేటర్లు రైతులకు అందజేశారు. భవిష్యత్తులో రైతులకు రాయితీపై మరిన్ని యంత్ర పరికరాలు అందిస్తామన్నారు. జొన్నలకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీ కృష్ణ, ఏడిఏ రాజశేఖర్ , సివిల్ సప్లై డిఎం రాజు నాయక్, మార్క్ఫెడ్ డిఎం హరినాథ్ రెడ్డి, గోస్పాడు ఏవో స్వప్నికారెడ్డి, ఏవో ప్రసాద్ రావు, మండల ఏఈవోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, టీడీపీ గోస్పాడు, నంద్యాలమండల కన్వీనర్లు తులసిరెడ్డి, విశ్వనాథరెడ్డి, డీసీ చైర్మన్ చాబోలు ఇలియాస్, నంద్యాల ఎంపీపీ ప్రభాకర్, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండలంలోని పారుమంచాల మజార గ్రామమైన సిద్దేశ్వరం గ్రామం లో నివసిస్తున్న గిరిజనులను ప్రభుత్వం ఆదుకోలేదని,నేటి వరకు ఐటీడీఏ అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించలేదని ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిస్టిక్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు జిల్లా ప్రభుత్వ అధికారులకు డిమాండ్ చేశారు. ఆదివారం పారుమంచాల మజార గ్రామమైన సిద్దేశ్వరం గిరిజనులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు మాట్లా డుతూ సిద్దేశ్వరంలో నివసిస్తున్న చెంచులను ఐటీడీఏలో చేర్చాలని పలుమార్లు అధికారులు కలిసిన వారు చేర్చలేదని,ఐటీడీఏలో లేనందున ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వారికి అందడం లేదని డిస్టిక్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో గత రెండు నెలల కిందట కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే కలెక్టర్ ఐటీడీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఇంతవరకు సిద్దేశ్వరం గ్రామ గిరిజనులను ఐటీడీఏ అధికారులు ఎందుకు సందర్శించలేదో సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఇంత నిర్లక్ష్యం చేస్తున్న ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. గిరిజనులకుతలదాచుకోవడానికి కూడా గృహాలు లేవని వారి జీవన పరిస్థితి చాలా అధ్వానంగా ఉన్నదని వెంటనే వారికి పక్కా గృహాలు నిర్మించి వారిని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఐటీడీఏ అధికారులు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. గ్రామాన్ని ఐటిడి అధికారులు ఇప్పటికైనా సందర్శించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే ఐటీడీఏ అధికారులపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునే విధంగా చేస్తానని ఆయన అన్నారు.

గ్రామ ప్రతిష్టను పెంచిన విద్యార్థిని

విశాలాంధ్ర - వెలుగోడు: బోయ రేవుల గ్రామ ప్రతిష్టను అదే గ్రామానికి చెందిన సుబ్బయ్య కుమార్తె సాయి స్ఫూర్తి పదవ తరగతి పరీక్షల్లో తాలూకా స్థాయిలో మంచి మార్కులు సాధించి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిందని గ్రామస్తులు ఆదివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సూర్యనారాయణ రెడ్డి రమణారెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థిని సన్మానించారు.

షేక్ ఇష్రత్‌ను అభినందించిన మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పదవ తరగతి ఫలితాలలో స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించిన షేక్ ఇష్రత్ ను రాష్ట న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అభినందించారు. ఇటీవల విడుదల చేసిన 2025 పదవ తరగతి ఫలితాలలో 599/ 600 మార్కులు సాధించి రాష్ట్రంలోనే నంద్యాల పేరును మారుమోగించి స్టేట్ సెకండ్ ర్యాంకులో నిలిచిన షేక్ ఇష్రత్ ను రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నంద్యాల తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ లు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాగే మంచి మార్కులు సాధించి రాష్ట్ర చరిత్రలోనే నంద్యాల పేరును చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా చేయాలని వారు చదువుకున్న స్కూల్ కి, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

విశాలాంధ్ర - చాగలమర్రి : పల్గాహం ఉగ్ర దాడి హేయమైన చర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని వరల్డ్ హ్యుమన్ రైట్స్ నేషనల్ మైనారిటీ సెల్ కన్వీనర్,అల్-ఖైర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మౌలాన్ అబ్దుల్ మజీద్ అరీఫ్ తెలియజేసారు.ఆదివారం ఆయన పట్టణంలో విలేఖరులతో మాట్లాడుతూ పర్యాటకులపై జరిగిన ఈ దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు.ఈ దాడిలో అమాయకులైన 26 మంది పర్యాటకులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు.ఈ దాడితో ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోందన్నారు.మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తున్నామన్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని బెలుంసింగవరం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక అదృశ్యం అయినట్లు సీఐ రమేష్ బాబు ఆదివారం తెలిపారు. ఈనెల 25వ తేదిన బాలిక ఇంట్లోనుండి బయటికి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. కూతురు కోసం తల్లి పలుచోట్లా వేదికిన కనిపించలేదని, ఆదివారం బాలిక తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుండి గ్రంథాలయంలో శిక్షణా తరగతులు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలోని గ్రంథాలయంలో ఈనెల నేటి నుండి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించబడునని గ్రంథాలయాధికారిణి ఎస్.రాధాభాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు శిక్షణా శిబిరాలు ఉంటాయని, ఉదయం 8గంటల నుంచి 8.30గంటల వరకు కథ వినడం, 8.30నుంచి 10గంటల వరకు పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, 10గంటల నుంచి 10.10 గంటల వరకు విరామం ఉంటుందన్నారు. 10.10 నుంచి 10.30 వరకు పుస్తక సమీక్ష, 10.30 నుంచి 11గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, జనరల్ నాలెడ్జ్ పైన అవగాహన వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సదవకాశాన్ని చిన్నారులు తల్లితండ్రుల ప్రోత్సాహంతో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంచినీటి బోరును ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మిడుతూరు : నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని, మిడుతూరు మండలం చింతలపల్లి గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛమైన నీటి సరఫరా బోరును ఆదివారం నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపల్లి గ్రామానికి గత కొన్ని సంవత్సరాల నుంచి మంచినీటి సమస్య ఉన్నదని గ్రామ ప్రజలు నా దృష్టికి తీసుకురావడంతో వెంటనే అధికారులతో మాట్లాడి మంచి బోరును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాగునీటి సమస్యపై ప్రతీరోజు నియోజకవర్గ ఉన్నతస్థాయిలో సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వంగల శివరామి రెడ్డి, సర్వోత్తం రెడ్డి, నాగేంద్ర, సాయిరాం కాలేజ్ సుధాకర్ రెడ్డి, కడుమూరు సుధాకర్ రెడ్డి, రమణారెడ్డి, రంగారెడ్డి, భూపాల్ రెడ్డి, గోకారి, అయ్యన్న , ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రజకుల ఐక్యతతోనే ఆర్థిక స్వావలంబన సాధ్యమం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రజకుల ఐక్యతతోనే ఆర్థిక స్వావలంబన సాధ్యమనీ రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల నేషనల్ పీజీ కళాశాలలో జిల్లా రజక ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి పాల్గొన్నారు. ఆమెకు రజక ఐక్యవేదిక అధ్యక్షులు సిహెచ్ సురేష్ సాదరంగా ఆహ్వానం పలికి గజమాలతో సత్కరించి సన్మానించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 70 గ్రామాల నుంచి రజక సమస్యలపై వినతులు స్వీకరించామని, ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ధోబిఘాట్ ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్నామన్నారు. జీవో నెంబర్ 6,27లను అమలు చేయాలని ప్రభుత్వానికి నివేదిక అందించామన్నారు. ప్రతి రజకుడు లేబర్ కార్డు పొంది ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోకుసుమాంబ, నందవరం శ్రీనివాసులు, రాజశేఖర్, మద్దిలేటి, సీడ్స్ మద్దిలేటి, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని సంగయ్య పేటకు చెందిన క్రీస్తుశేషులు పగ్గాల చిన్న రాముడు, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు పగ్గాల రమేష్, బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలాజీ ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నియోజవర్గ టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తము వచ్చే ప్రజలకు ముఖ్యంగా పేదవారికి చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ టౌన్ ప్రెసిడెంట్ మాసం భాష, వైస్ ప్రెసిడెంట్ తిమ్మారెడ్డి,బండారి శ్రీనివాసులు,శివ,కళాకర్, ముత్తు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించే సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి కె.సుజాత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని మాట్లాడుతూ నేటి నుంచి జూన్ ఆరో తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రంథాలయంలో సమ్మర్ ఓరియెంటెషన్ ప్రొగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆరుబయట ఎండలో తిరగనీయకుండా,గ్రంథాలయానికి పంపాలని సూచించారు. స్థానిక గ్రంథాలయంలో సీనియర్ ఉపాధ్యాయులతో చదివించడం,కథలు చెప్పడం నీతి బోధించడం, డ్రాయింగ్ నిర్వహించి సృజనాత్మకను వెలికి తీయడం, క్యారం బోర్డు,చదరంగం,ఆట పాటలతో పాటు జనరల్ నాలెడ్జ్ సంబంధించి క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ పిల్లలను పాల్గొనేలా,తమ పిల్లలకు గ్రంథాలయంలో సభ్యులుగా చేర్పించి, పిల్లలలో గ్రంథపఠనం అలవడేలా విజ్ఞానాన్ని సంపాదించే భావిభారత పౌరులుగా చూడవచ్చని తెలిపారు. పిల్లలను "సెల్ ఫోన్"లో నుండి దృష్టి ని మళ్ళించి వారి "మానసిక స్థితి"నుండి కాపాడుటకు ప్రతి ఒక్కరూ తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి,గ్రంథాలయాల బాట పట్టేలా కనీసం ఒక గంటయైనా గడిపేలా" మొక్క యై వంగనిది మ్రానై వంగునా అనే సూక్తిని గ్రహించి గ్రంథాలయానికి పంపాలన్నారు. ప్రతిరోజు ఉదయం 8గంటల నుండి 11గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నీటి ఎద్దడికి చర్యలు : సర్పంచ్

విశాలాంధ్ర - పాములపాడు : మండలంలోని వేంపెంట గ్రామానికి వేసవిలో నీటి ఎద్దడి రాకుండా గ్రామానికి అనుకుని ఉన్న కేసి కెనాల్ అనుసంధానమైన నిప్పుల వాగును గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, కంభం.మోహన్ గౌడ్, గంట.రమేష్, ఆదిరెడ్డి, గ్రామస్తులతో కలిసి కలుషితమైన నిప్పుల వాగును శుభ్రపరచి, గ్రామస్తుల అవసరాలకు, పశుపక్షాదుల త్రాగునీటి కోసం మట్టి ఆనకట్టను ఆదివారం వేయడం జరిగింది. ఈ సందర్భంగా వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ మాట్లాడుతూ నిప్పుల వాగు చెత్తాచెదారం నిండిపోయి కలుషితంగా ఉండేదని దానిని జెసిబి సహాయంతో తీసివేసి గ్రామ నాయకులు మరియు గ్రామస్తుల సహకారంతో కలిసి పశుపక్షాదుల మంచినీటి కొరకు, గ్రామంలోని బోరింగులు, బావులు నీటి నిల్వ కొరకు మట్టి ఆనకట్టను నిర్మించడం జరిగిందన్నారు.ఈ నీళ్ల వలన ఎండలు తీవ్రతరంగా ఉన్న ఈ వేసవికాలంలో నీటి కొరత నిర్మూలించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గంటా మధుసూదాకర్, దానమయ్య, లెనిన్ బాబు, శంకర్ రాముల నాయక్ హుస్సేన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల బాట పట్టేలా చూడాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రతి ఒక్కరూ తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి తమ పిల్లలు గ్రంథాలయాల బాట పట్టేలా చూడాలని గ్రంథాలయ అధికారి అరుణ కుమారి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాలమేరకు ఆళ్లగడ్డ శాఖ గ్రంథాలయంలో సమ్మర్ ఓరియెంటెషన్ ప్రొగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బయట ఎండలో తిరగనీయకుండా గ్రంథాలయానికి పంపాలన్నారు. గ్రంథాలయంలో అనుభవ ఉపాధ్యాయులతో చదివించడం, కథల ద్వారా నీతి బోధించడం, డ్రాయింగ్ ద్వారా దాగియున్న సృజనాత్మకను వెలికి తీయడం, క్యారమ్ బోర్డు, చదరంగం తదితర ఆటలతో పాటు జనరల్ నాలెడ్జ్ సంబంధించి క్విజ్ పోటీలను నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తమ పిల్లలను పాల్గొనేలా తమ పిల్లలకు గ్రంథాలయంలో సభ్యులుగా చేర్పించి, పిల్లలలో గ్రంథపఠనం అలవడేలా అలవాటుగా మారితే, తద్వారా సమాజ సేవలో భావిభారత పౌరులుగా చూడవచ్చన్నారు. పిల్లలను "సెల్ ఫోన్" నుండి దృష్టి ని మళ్ళించి వారి "మానసిక స్థితి"నుండి కాపాడుటకు ప్రతి ఒక్కరూ తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి,"గ్రంథాలయాల బాట" పట్టేలా కనీసం ఒక గంటయైనా గడిపేలా చూడాలన్నారు. ఉదయం 8 గంటల నుండి 11గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ..

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ దైవ క్షేత్రమైన శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను వేసవి సెలవులు ప్రారంభం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దేశ నలుమూలల నుండి శ్రీశైలం చేరుకొని పవిత్ర పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి అమ్మ వారినిదర్శించుకునేందుకు వేకువ జాము నుండే క్యూలైన్‌లో వేచి ఉన్నారు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆలయ అధికారులు భక్తుల రద్దీకిఅనుకూలంగా ఏర్పాట్లు చేశారు సుమారు 50 వేలకు మందిపై భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని అంచనా..

కుటుంబ సాధికార కమిటీ
బలోపేతానికి కృషి చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కుటుంబ సాధికార కమిటీలు బలోపేతం చేయడానికి నాయకులతో కలుస్తున్నట్టు పార్టీ అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డిని పార్టీ అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ భూమా గృహంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు పటిష్టంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరిక అని, కుటుంబ సాధికార కమిటీలు బలోపేతం చేయడానికి నాయకులను కలుస్తున్నామని, ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డినీ కలిశామన్నారు. రాబోవు కాలంలో క్లస్టర్, బూత్ కమిటీలు, వార్డ్ కమిటీలు, టౌన్ కమిటీలు, జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలు పూర్తిచేసుకొని మహానాడుకు వెళతామన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 28, ఏప్రిల్ 2025

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం : మంత్రి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు: ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా ప్రతి ఒక్క హామీని తప్పకుండా నెరవేరుస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఎన్నికల హామీ మేరకు మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించి వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని మంత్రి అన్నారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని తమ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా అని ఆయన ప్రశ్నించారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశపెట్టిందని, కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారిందని తెలిపారు. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామని, మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామన్నారు. అంతేకాకుండా వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉందన్నారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని, దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో 29శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోందన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. చేపల పెంపకం వల్ల ఎన్నో లాభాలున్నాయని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలని మంత్రి పేర్కొన్నారు.

పొగాకు పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు: జిల్లాలో పొగాకు పంటను కొనుగోలు చేయకుండా రైతులను తీవ్రంగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని,తక్షణమే పొగాకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ఎంపీ బస్తి పాటి నాగరాజు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం బార్లీ మీదలగు పొగాకు ధరలు బాగా ఉండటంతో ఈ ఏడాది ధరలు బాగా ఉంటాయని కంపెనీల ప్రతినిధులు ప్రోత్సహించడంతో రైతాంగం ఇస్తారంగా బార్లీ, సిగరెట్, బీడీ ఏ119 రకాలతో పాటు నాటు రకాలు కూడా పెద్ద ఎత్తున ఉమ్మడి కర్నూలు జిల్లాలో విస్తృతంగా సాగు చేశారని అన్నారు. చాలా ఎకరాలలో ఈ సంవత్సరము పంట వేశారని, దక్కన్ జీపీఐ, వీటీఎస్ తదితర కంపెనీలు బల్లి పొగాకును, సిగరెట్‌కు ఉపయోగించి పొగాకు ను రైతులకు ఇచ్చారన్నారు. రూ.18 వేల ప్రకారం కొనుగోలు చేస్తామని మాట ఇచ్చి, పంట పండి చేతికి వచ్చిన తర్వాత పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని పార్లమెంటు పరిధిలో ఉన్న కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆస్పరి పత్తికొండ, వెల్దుర్తి, క్రిష్ణగిరి తదితర ప్రాంతాలలో విస్తారంగా సాగు చేశారన్నారు. ఒక ఎకరానికి 60 వేల దాకా పెట్టుబడి కూడా పెట్టారని, రైతులు ఇంత భారీగా పెట్టుబడి పెట్టి, పొగాకు పంట పండిస్తే పంట చేతికి వచ్చిన తర్వాత కంపెనీ గోదాములకు పొగాకును తీసుకెళ్తే, పొగాకు బేళ్లను వాపస్ పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకును తక్కువ ధర కొనుగోలు చేస్తున్నారని, ఒక క్వింటాం రూ.5 వేల నుండి రూ.6 వేల ప్రకారం కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ధర ఏమాత్రం సరిపోదన్నారు. ఈ ధరకు రైతు పొగాకును అమ్మితే తీవ్రమైన తీవ్రమైన నష్టాలకు గురి కావడం జరుగుతుందన్నారు. తక్షణమే రైతుల పండించిన పంటను మార్కెఫెడ్ ద్వారా క్వింటాల్ రూ.18 వేల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, గోడౌన్ల దగ్గరికి రైతులు తెచ్చిన పొగాకు మొత్తమును కంపెనీ యజమానులతో చర్చించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు.సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి మహేష్, రైతు సంఘం నాయకులు దొడ్డిపాడు మహమ్మద్ బాష, రామదాసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని, నిర్దేశిత గడువులోపు పరిష్కారం పొందవచ్చని కమిషనర్ సూచించారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఆచార్యా ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో ఈ నెల 29, 30 తేదీల్లో ఆంగ్రు వజ్రోత్సవాలు జరుగుతున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి తెలిపారు. ఆచార్యా ఎన్.ఈ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము ఆవిర్భావం చెంది 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫామ్‌లో వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శనివారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ చిన్న కమతాల్లో సుస్థిరమైన నికర ఆదాయం పొందగలిగే సాంకేతిక పరిజ్ఞానంపై సదస్సు జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. రైతు సదస్సుతో పాటు వివిధ వ్యవసాయ అనుబంధ శాఖల సాంకేతికతను ప్రదర్శించడానికి స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. రైతులు భారీగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరు అవ్వాలని, ఆసక్తి ఉన్న కర్నూలు జిల్లా రైతులు కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి నందు 7702366115 నెంబర్ కు కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

ఉత్సాహంగా సాంస్కృతిక పోటీలు

విశాలాంధ్ర - గూడూరు: మండల కేంద్రంలో శ్రీ తిమ్మ గురుడు స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో మాజీ జెడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు, చైతన్య యూత్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక పోటీలు శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన యువకులకు క్రీడ నిర్వాహక కమిటీ సభ్యులు మెమెంటో తోపాటు నగదు బహుమతి అందజేశారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన గూడూరు విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేసి అభినందించారు. ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిమ్మగురుడు స్వామి జాతర సందర్భంగా 32 ఏళ్లుగా క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అచీవ్ అకాడమీ చైర్మన్ రవి సాగర్, చైతన్య యూత్ సభ్యులు మనోహర్, సాక్షి శ్రీనివాసులు, పి.కృష్ణ, రామయ్య, విశ్వనాథ ఆచారి, టీచర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఆదోని క్రైం : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. మే డే పోరాట స్ఫూర్తితో నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ నాగరాజు, పట్టణ కార్యదర్శి బి.వెంకన్న, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు శేక్షావలి, లక్ష్మీనారాయణ, వైటీ భీమేష్, హుసేని, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే ఆందోళన తప్పదు

విశాలాంధ్ర - కర్నూలు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న సిబ్బందికి నేటి వరకు 12 నెలలుగా వేతనాలు విడుదల చేయకపోవడం వల్ల వారి కుటుంబాలు పుటగడవక అగమ్యగోచరంగా ఉన్నాయని, తక్షణమే 12 నెలల వేతనాలు విడుదల చేయాలని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలతో పాటుగా నిరాహార దీక్షలు చేపడుతామని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి పి.సుంకయ్యలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం సుధాకర్ అధ్యక్షులు గా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 14 వేల మంది పనిచేసే ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 12 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు ప్రశ్నించారు. పీఏసీఎస్ఐ సౌకర్యం కల్పించి ఎస్ఆర్ పాలసీ అమలు చేయాలని వారు కోరారు. త్వరలో వేతనాలు విడుదల కానీ పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన కి పిలుపు ఇస్తామని అవసరమైతే నిరాహార దీక్షలకు సిద్ధమవుతామన్నారు. యూనియన్ జిల్లా నూతన కౌన్సిల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ బాబు తెలిపారు. కర్నూలు జిల్లా గౌరవా ధ్యక్షులుగా ఎస్.మునెప్ప, జిల్లా అధ్యక్షులుగా నాగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పుల్లయ్య, ఉపాధ్యక్షులు గా శ్రీదేవి, నల్లారెడ్డి, స్వామి ప్రధాన కార్యదర్శి గా రవి బాబు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, సహాయకార్యదర్శులుగా అగ్గి రాముడు, నాగేంద్రమ్మ, వెంక టేశ్వర్ రెడ్డి, ట్రెజరర్‌గా శేఖర్, తో పాటు 10 మంది కమిటీ మెంబర్స్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో పిడుగుపడి బోయ శ్రీనివాసులు (52) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు సాయం కాలం ఉరుములు, మెరుపులతో గాలి, వాన వచ్చిందన్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న పొలంలో శ్రీనివాసులు పని చేస్తుండగా గాలితో కూడిన వర్షం రావడంతో చెట్టు కింద వెళ్లారన్నారు. ఒక్కసారిగా భయంకరమైన ఉరుము, మెరుపుల శబ్దంతో పిడుగు పడిందన్నారు. శ్రీనివాసులు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని తన భర్త మృతితో తమకు ఎవరు దిక్కని భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో రోడ్డున పడిన మా బ్రతుకు జీవితాలను ప్రభుత్వమే ఆదుకోవాలని భార్య పిల్లలు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: వారంతా చిన్ననాటి స్నేహితులు. ఒకేచోట చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరి కొంతమంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసా గుతున్నారు. వారంతా కలిసి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకోవాలను కున్నా రు. ఈ మేరకు ఆదివారం నగరంలోని సీఆర్ఆర్ ఎంఎంసీ ఉన్నత పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సర బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని, విద్యా ర్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులైన గోపాల్ రెడ్డి, హరిప్రసన్న, రాజేశ్వరి రెడ్డి, మాదన్న, సుధాకర్, నారాయణ రెడ్డి, రామశాస్త్రి, త్యాగరాజ్, రూతమ్మ, రంగమ్మ, అంజనాబాయి, పద్మావతి, స్వర్ణకుమారి, సరస్వతిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారికి పూల కుండీలను బహుకరించారు. 80 మంది పూర్వ విద్యార్థు లందరూ ఒకేచోట చేరడంతో సందడి వాతావరణం నెల కొంది. ఇక నుంచి అందరం అందుబాటులో ఉందా మంటూ సెల్ నెంబర్లు తీసుకున్నారు. ఈ మధుర జ్ఞాపకాలను తమ సెల్‌ఫోన్ లలో బంధించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

పిడుగుపడి రెండు కాడెద్దులు మృతి

విశాలాంధ్ర- పెద్దకడబూరు: మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో రైతు చిన్న మాదన్నకు చెందిన రెండు కాడెద్దులు ఆదివారం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. రైతు చిన్న మాదన్న తన కాడెద్దులను పొలంలో కట్టేసి ఉండగా భారీ ఉరుములతో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అక్రమంగా ఎర్రమట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

విశాలాంధ్ర - సి.బెళగల్: అక్రమంగా ఎర్రమట్టి రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఏఎస్సై తిమ్మప్ప ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అడ్డదారిలో సొమ్ములు చేసుకునేందుకు కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి రవాణా చేస్తు న్నారని తెలుసుకున్న ఎస్ఐ తిమ్మప్ప టాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా ఎర్రమట్టిని తీసుకుపోవడం చట్ట రీత్యానేరమని ఏఎస్సై వారిని హెచ్చరించి, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మృతుడి కుటుంబానికి కార్మికుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ బోయ శ్రీనివాసులు అనే కార్మికుడు అనారోగ్యం తో మృతి చెందాడు. తోటి కార్మికులైన డ్రైవర్లు, క్లీనర్లు శ్రీనివాసులు కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు ఆధ్వర్యంలో డ్రైవర్లు, క్లీనర్లు పట్టణంలోని స్థానిక మాల వీధిలోని మృతుడు డ్రైవర్ శ్రీనివాసులు నివాసానికి చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను ప్రమర్శించి, తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారందరూ కలిసి రూ.21 వేలు నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన భౌతికకాయాన్ని ఎర్ర వస్త్రంతో కప్పి, పూలమాలలు వేసి కార్మికులందరూ ఉద్యమ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సీపీఐ నాయకులు దూల భాస్కర్, గడ్డం నాగరాజు, వాసు, అశోక్, టిప్పర్ శ్రీనివాసులు, సీమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండ వ్యాధుల నివారణ, చికిత్సలపై అవగాహన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఆరోగ్య భారతి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు బుధవారిపేటలోని కేశవ మెమోరియల్ స్కూల్ నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఆరోగ్య భారతి అభ్యాసక వర్గ కార్యకర్తలకు ఆరోగ్య అవగాహనా కార్యక్రమం ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు నిర్వహించారు. శ్రీ రాఘవేంద్ర ధన్వంతరి ప్రార్థనతో మొదలు పెట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరోగ్యభారతి ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.శ్రీధరశర్మ, మూత్రపిండ వ్యాధి నిపుణులు, అసోసియేట్ ప్రొఫెసర్ కర్నూలు మెడికల్ కాలేజ్ కర్నూలు వారు పాల్గొని, మూత్రపిండ వ్యాధుల నివారణ, చికిత్స గురించి తెలిపారు. ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి మోక్షే శ్వరుడు రిటైర్డ్ జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి కుటుంబవ్యవస్థ, ఆరోగ్యంపై సీజనల్ వ్యాధులపై, అవగాహన కల్పించారు డాక్టర్ సి.స్ఫూర్తి అశ్విని హాస్పిటల్ వారు ప్రసూతి, స్త్రీ వ్యాధి చికిత్సా నిపుణులు స్త్రీ వ్యాధులు, చికిత్స గురించి అవగాహన కల్పించారు. జిల్లా కార్యదర్శి బి.సత్యనారాయణ రెడ్డి నివేదిక సమర్పించి, కార్యక్రమం నిర్వహించారు ఆరోగ్య భారతి కార్యకర్తలు రాఘవేంద్ర, వెంకటేష్, డాక్టర్ కె.చంద్రశేఖర్, ప్రొఫెసర్ ఫార్మకాలజీ మొదలగువారు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - సి.బెళగల్: విద్యుధాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న బాష, బండల డిపోలో పని చేస్తున్న కార్మికుడు బోయ కాలప్ప మృత్యువాత పడ్డారు. మండల పరిదిలోని బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ కాలప్ప (55) బండల డిపోలో దినసరి కూలిగా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో చనిపోయాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు కాగా ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు బంధువులు రోదిస్తున్నారు.

ఉల్లాసానికి పిడుగుపాటు

ఇద్దరు యువకులు మృతి
ఇద్దరు యువకులకు గాయాలు

విశాలాంధ్ర - కౌతాళం రూరల్ : పాఠశాలలకు, కళాశాలలకు వేసవి సెలవులు రావడం, వ్యవసాయ పనులకు తీరిక దొరకదంతో గ్రామంలోని యువ కులు ఉల్లాసంగా ఉత్సాహంగా అందరూ ఏకమై ఇష్టమైన క్రికెట్ ఆటను ఆడాలని ఎంతో ఇష్టంగా అందరం కలిసి మైదానానికి బయలుదేరారు. ప్రతిరోజులాగే ఆటలో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా ఆదివారం మధ్యాహ్నం 1:00 సమయంలో జోరుగా గాలి, ఉరుములు, మెరుపులు, చిన్నపాటి చినుకులు రావడంతో కొంతమంది యువకులు పరుగున పక్కనున్న చెట్టు వద్దకు ఆశ్రయం కోసం వెళ్లారు. కొంతమంది మైదానంలో ఉండడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడింది. చూస్తుండగానే ఇద్దరు యువకులు బాలయ్య, అశోక్ తీవ్రంగా గాయపడగా, నిరూపాది, గంగాధర్ స్వల్ప గాయాలు అయ్యాయి. ఊహించిన సంఘటన నుండి బయటపడిన యువకులు పరుగోపరుగున గ్రామంలో వెళ్లి సమాచారాన్ని అందించారు. దీంతో కుటుంబ సభ్యులు మైదానం వైపు పరుగులందించారు. చికిత్స కోసం హుటా హుటిన కౌతాళంలోని ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకువచ్చారు. అయితే వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి బాలయ్య(22), అశోక్ (21) మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలయ్యకు గత ఎడాది పెళ్లి కాగా భార్య మీనాక్షి గర్భవతి కావడంతో తల్లిదండ్రులు, భార్య రోదనలు అందరిని కంటతడి పెట్టించింది. నిరూపాది ఇటీవలే వెలువడిన పదో తరగతి ఉత్తీర్ణత సాధించాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాగల 4,5 రోజుల్లో జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉరుములతో కూడిన వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, బహిరంగ ప్రదేశాలలో ఉండకూడదని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పొలాల్లో పనిచేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పని చేసే వారు, రైతులు, పశువుల కాపరులు, గొర్రెలు కాపరులు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని కలెక్టర్ సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

బీసీ గురుకులాల్లో వందశాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ గ్రామ సమీ పంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో చదివిన విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణతతో, అత్యధికంగా 588 మార్కులు సాధించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు ఛాలెంజ్గా నిలిచింది. పదవ తరగతిలో 76 మంది విద్యార్థులలో, పదవ తరగతి ఫలితాల్లో దాదాపు 39 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించి ప్రభంజనం సృష్టించారు. పదో తరగతి ఫలితాలు అనంతరం సర్వే ఆధారంగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో అత్యధికంగా 588 మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తూ బహుమానం అందజేయడంతో పాటు ప్రిన్సిపల్ యమునా దేవికి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యమునా దేవి మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులలో ఫెయిల్ అన్నా ప్రస్తావన దరిదాపుల్లో రాకుండా ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పుతూ గౌరవప్రదంగా మెలిగే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. పదో తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి, బంగారు భవిష్యత్తుకు బాటలు పడే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పదో తరగతి, ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులు సాధించిన మాల దళిత విద్యార్థులకు అభ్యుదయ దళిత సేవా సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనం నందు ప్రతిభ పురస్కార అవార్డులు అందజేసినట్లు సీనియర్ ఉపాధ్యాయుడు ఏసీ సుంకన్న తెలిపారు. మాల విధ్యార్థులు పదో తరగతి నందు ఎండీ సాయి నందిని 596, సంకేత్ 585, రుత్వక్ సాయి 581, సూర్యతేజ 576, ఇంటర్మీడియట్ నందు రాఘవేంద్ర 958మార్కులతో ఇటీవల విడుదలైన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మీడియా రంగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన బహుజన మీడియా సంపాదకుడు, సామాజిక కార్యకర్త అయిన బూదూరు శ్రీనివాసులు డా.ఏపీజే అబ్దుల కలాం అవార్డు అందుకన్న సందర్భముగా విద్యా-ప్రతిభా పురస్కారాలు అందజేయడమైన జరిగిందన్నారు. సమావేశంలో అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు కళ్ళు పోతుల రంగన్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అభినందిస్తూ వారు భవిష్యత్తులో మరింత బాగా విద్యలో మంచి ప్రతిభ కనబరిచి మంచి స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ ఏసీటీఓసీ ఆర్.స్వామి మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకొని మరింత ముందుకు సాగాలని అదేవిధంగా అభినయ దళిత సేవా సంఘం మీ వెన్నంటే ఉంటుందని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయ నాయకులు, తిక్క స్వామి వివిధ పార్టీల నాయకులు గంగాధర్, వీరేష్ ఐఎఫ్టియు నరసన్న, కుంకనూరు వీరేష్, బాలాజీ, కోదండ, బుజ్జప్ప, వన్నూర్ మాల కుల బంధువులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాను వర్తింపజేయాలి



విశాలాంధ్ర - కర్నూలు సిటీ: కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఇచ్చిన మత్స్యకార భరోసా రాయలసీమ జిల్లాలకు వర్తింపజేయాలని జాతీయ మత్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు పట్టణంలోని మత్స్యకార సంఘం కార్యాలయంలో మత్స్యకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బెస్త శ్రీనివాసులు మాట్లాడుతూ ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు రాష్ట్రంలో చేపల వేట జరగకుండా వెయిటర్ నిషేధం విధిస్తారన్నారు. అందరికీ మత్స్యకార భృతి వర్తింపజేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ఇంగ్లాండ్ చెరువులపై ఆధారపడి జీవిస్తున్న మత్స్య కారులకు వేట నిషేధ సమయంలో భృతి చెల్లించకపోవడం, కూటమి ప్రభుత్వము రాయలసీమ మత్స్యకాలను మోసం చేసినట్లేనని విమర్శించారు. ఇప్పటికైనా రాయలసీమ జిల్లాలోని మత్స్యకారులు కూటమి ప్రభుత్వ ద్వంద వైఖరిని పసిగట్టాలని, మోసపు వాగ్దానాలను నమ్మ వద్దని ఆయన సూచించారు. బెస్త సత్యనారాయణ, ఎద్దుల వెంకటేశ్వర్లు, బెస్త కమల, తెలుగు కన్నా, తెలుగు నందకిషోర్, తెలుగు నాగరాజు, తెలుగు మోహన్, కుల సంఘం పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 28, ఏప్రిల్ 2025

పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఆశయంతోనే పెద్ది రెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 55వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెల కుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ ప దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మనిచ్చిన ఊరికి సేవ చేస్తున్న డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి సేవలు అభినందనీయ మన్నారు. పేద ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతు న్నారని, ఇందులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మించి మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తూ తనకు జన్మ ఇచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడమేనన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారు.

డాక్టర్ రవికృష్ణను సత్కరించిన నంద్యాల ఐఎంఏ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం 177వ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో నిర్వహించిన తెలుగు నాటక రంగ దినోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగ స్థల లక్ష రూపాయల నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్న డాక్టర్ రవికృష్ణను ఐఎంఏ, నంద్యాల తరపున పలువురు వైద్యులు శాలువలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ డాక్టర్ రవికృష్ణ దర్శకత్వంలో కళారాధన సంస్థ ద్వారా సామాజిక చైతన్యం కలిగించే సాంఘిక నాటకాలు, పద్య పౌరాణిక నాటకాలు, బాలలలో సామాజిక స్పృహ పెంచడానికి బాలల నాటికలు అనేకం రూపొందించి రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలలో, రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో వందలాది ప్రదర్శనలు చేసి నంద్యాల కళావైభవాన్ని రాష్ట్ర, దేశ వ్యాప్తంగా తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. నంద్యాలకు దాదాపు 20 నంది బహుమతులు తీసుకురావడం జరిగిందన్నారు. 2017లో ఉగాది పురస్కారం, 2018లో కళా రత్న హంస పురస్కారం అందుకున్న డాక్టర్ రవికృష్ణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక కందుకూరి రంగస్థల రాష్ట్ర స్థాయి పురస్కారం అందించడం నంద్యాలకు గర్వకారణమన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ కళారాధన సంస్థ 2000 సంవత్సరంలో ప్రారంభించబడిందని, 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని, రజతోత్సవ వేడుకల్ని సంవత్సరం పొడవునా నిర్వహించదలచామని, కళారాధన కార్యక్రమాలకు గత పాతిక సంవత్సరాలుగా నంద్యాల వైద్యులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ వసుధారాణి, డాక్టర్ పనిల్ కుమార్, అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని, నిర్దేశిత గడువులోపు పరిష్కారం పొందవచ్చని కమిషనర్ సూచించారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఆచార్యా ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో ఈ నెల 29, 30 తేదీల్లో ఆంగ్రు వజ్రోత్సవాలు జరుగుతున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి తెలిపారు. ఆచార్యా ఎన్.ఈ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము ఆవిర్భావం చెంది 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫామ్‌లో వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శనివారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ చిన్న కమతాల్లో సుస్థిరమైన నికర ఆదాయం పొందగలిగే సాంకేతిక పరిజ్ఞానంపై సదస్సు జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. రైతు సదస్సుతో పాటు వివిధ వ్యవసాయ అనుబంధ శాఖల సాంకేతికతను ప్రదర్శించడానికి స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. రైతులు భారీగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరు అవ్వాలని, ఆసక్తి ఉన్న కర్నూలు జిల్లా రైతులు కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి నందు 7702366115 నెంబర్ కు కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

మే డేను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఆదోని క్రైం : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. మే డే పోరాట స్ఫూర్తితో నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబీ నాగరాజు, పట్టణ కార్యదర్శి బి.వెంకన్న, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు శేక్షావలి, లక్ష్మీనారాయణ, వైటీ భీమేష్, హుసేని, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం సంజీవ నగర్ గేట్ నందు గల ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.అనిల్ కుమార్, డాక్టర్ వి.హరితల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుమల పునీత్ హాస్పిటల్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక ల్యాబ్‌ను రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో మొట్ట మొదటి చెవి ముక్కు గొంతు హాస్పిటల్ ప్రారంభించింది అనిల్ కుమార్ తాతయ్య తిరుమలాచారి అని, వారి మార్గంలోనే వారి కుమారులు సత్యనారాయణ, వారి మనవడు అనిల్ కుమార్ నంద్యాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడం ఎంతో సంతోషకరమైన్నారు. డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నంద్యాలలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని నంద్యాల ప్రజలకు వీడియో మైక్రోస్కోప్ ద్వారా త్వరితగతిన వ్యాధి నిర్ధారణ చేసి ఇన్ఫెక్షన్ సోకకుండా చికిత్స చేయడానికి ఈ అత్యాధునిక ల్యాబ్ ఎంతో ఉపయోగపడతుందని, నంద్యాల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు మధుసూదన్ రావు, వైస్ ప్రెసిడెంట్ ఐఎంఏ స్టేట్ విజయ్ భాస్కర్ రెడ్డి, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ మధు సూదన్ రెడ్డి, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ బాబన్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక పోటీలు

విశాలాంధ్ర - గూడూరు: మండల కేంద్రంలో శ్రీ తిమ్మ గురుడు స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో మాజీ జెడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు, చైతన్య యూత్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక పోటీలు శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన యువకులకు క్రీడ నిర్వాహక కమిటీ సభ్యులు మెమెంటో తోపాటు నగదు బహుమతి అందజేశారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన గూడూరు విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేసి అభినందించారు. ఎల్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిమ్మగురుడు స్వామి జాతర సందర్భంగా 32 ఏళ్లుగా క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అచీవ్ అకాడమీ చైర్మన్ రవి సాగర్, చైతన్య యూత్ సభ్యులు మనోహర్, సాక్షి శ్రీనివాసులు, పి.కృష్ణ, రామయ్య, విశ్వనాథ ఆచారి, టీచర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దేవనగర్‌లో కార్డెన్ సర్చ్ ఆపరేషన్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణం దేవనగర్‌లో పట్టణ సీఐలు కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల సబ్ డివిజన్ ఎఎస్పీ జావలి ఆల్ఫోన్స్ సూచనలతో నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దేవనగర్ నాగుల కట్ట, దేవనగర్ పార్క్, నూరాని మసీద్ సెంటర్, ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించామని అనంతరం అనుమానితులు, నేరచరిత్ర గలవారు, రౌడీషీటర్లు ఏదైనా నేరాలలో పాల్గొంటున్నారని అనుమానంతో వారి వేలిముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైస్ ద్వారా పరిశీలించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించిన నేరాలలో పాల్గొన్న చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో అనగా గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా, మట్కా జూదం తదితర వాటికి సంబంధించిన కార్యకలాపాలలో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, 2టౌన్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, 3టౌన్ ఇన్స్పెక్టర్ కంబగిరి రాముడు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో పిడుగుపడి బోయ శ్రీనివాసులు (52) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు సాయంకాలం ఉరుములు, మెరుపులతో గాలి, వాన వచ్చిందన్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న పొలంలో శ్రీనివాసులు పని చేస్తుండగా గాలితో కూడిన వర్షం రావడంతో చెట్టు కింద వెళ్లార న్నారు. ఒక్కసారిగా భయంకరమైన ఉరుము, మెరుపుల శబ్దంతో పిడుగు పడిందన్నారు. శ్రీనివాసులు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని తన భర్త మృతితో తమకు ఎవరు దిక్కని భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో రోడ్డున పడిన మా బ్రతుకు జీవితాలను ప్రభుత్వమే ఆదుకోవాలని భార్య పిల్లలు కోరారు.

పిడుగుపడి రెండు కాడెద్దులు మృతి

విశాలాంధ్ర- పెద్దకడబూరు: మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో రైతు చిన్న మాదన్నకు చెందిన రెండు కాడెద్దులు ఆదివారం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. రైతు చిన్న మాదన్న తన కాడెద్దులను పొలంలో కట్టేసి ఉండగా భారీ ఉరుములతో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వంతో మత్స్యకారుల దశ మారింది : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నందికొట్కూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మత్స్యకారుల దశ మారిందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార కుటుంబాలకు రూ259 కోట్ల తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు.దీని వల్ల 1,29,178 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, దీంతోమత్స్యకార గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమనిఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచడం జరిగిందన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందని, ఏ ఒక్కమత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా అన్నారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామని, మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామని వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామనిఎన్నికల హామీల అమలుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద రెడ్డి, మిడ్తూరు మండల కన్వీనర్ రమేష్ రెడ్డి, పగిడ్యాల మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, నాయకులు శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఎర్రమట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

విశాలాంధ్ర - సి.బెళగల్: అక్రమంగా ఎర్రమట్టి రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఏఎస్సై తిమ్మప్ప ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అడ్డదారిలో సొమ్ములు చేసుకునేందుకు కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి రవాణా చేస్తు న్నారని తెలుసుకున్న ఎస్ఐ తిమ్మప్ప టాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా ఎర్రమట్టిని తీసుకుపోవడం చట్ట రీత్యానేరమని ఏఎస్సై వారిని హెచ్చరించి, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మృతుడి కుటుంబానికి కార్మికుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ బోయ శ్రీనివాసులు అనే కార్మికుడు అనారోగ్యం తో మృతి చెందాడు. తోటి కార్మికులైన డ్రైవర్లు, క్లీనర్లు శ్రీనివాసులు కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు ఆధ్వర్యంలో డ్రైవర్లు, క్లీనర్లు పట్టణంలోని స్థానిక మాల వీధిలోని మృతుడు డ్రైవర్ శ్రీనివాసులు నివాసానికి చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను ప్రమర్శించి, తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారందరూ కలిసి రూ.21 వేలు నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన భౌతికకాయాన్ని ఎర్ర వస్త్రంతో కప్పి, పూలమాలలు వేసి కార్మికులందరూ ఉద్యమ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సీపీఐ నాయకులు దూల భాస్కర్, గడ్డం నాగరాజు, వాసు, అశోక్, టిప్పర్ శ్రీనివాసులు, సీమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ పథకం రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : రైతు సోదరులందరూ వ్యవసాయ యాంత్రికరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డ్ నందు రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం గురించి వివరించారు. ముఖ్యంగా 2024-25లో భాగంగా రైతులకు జొన్నలు పండించిన ప్రతి రైతు దగ్గర పౌర సరఫరా శాఖ ద్వారా 3371 రూపాయలు క్వింటాలుకి ఇస్తూ వాటికి అవసరమైన గోనె సంచులు, రవాణా ఖర్చులు రైతులకి అందజేస్తూ కొనుగోలు చేస్తుందని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా వ్యక్తిగత యంత్ర పరికరాలు తీసుకున్న రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని మరియు మిగిలిన రైతులుకి త్వరలో ఈ పథకం అందేలా చూస్తామని తెలిపారు. మార్కెట్ మెంబర్ తులసి రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు 30 వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోలుకు ప్రభుత్వం ద్వారా అనుమతి వచ్చిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకవేళ 30 వేల మెట్రిక్ టన్నుల టార్గెట్ ఐపోయిన ప్రభుత్వం నుండి ఇంకో 10 వేలు మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి తీసుకొస్తామని రైతులు ఇబ్బంది పడకుండా వారి జొన్నలు అమ్ముకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ నంద్యాల మండలానికి 5 వేల మెట్రిక్ టన్నులు, గోస్పాడు మండలానికి 4 వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోలుకు అనుమతి వచ్చిందని, నంద్యాల మండలములో 45 మంది రైతులకు, గోస్పాడులో 35 మంది రైతులకు వివిధ వ్యతిగత యంత్ర పరికరాలైన తైవాన్ స్ప్రేయర్‌లు, రోటవేటర్‌లు, విత్తన గొర్రులు, గుంటకలు అందించడం జరిగినది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వై.మురళీ కృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు డి.రాజ శేఖర్, మార్కెట్ డీఎం హరనాథ రెడ్డి, డీఎం సివిల్ సప్లై రాజు నాయక్, మండల వ్యవసాయ అధికారి, నంద్యాల ఇ.ప్రసాద రావు, మండల వ్యవసాయ అధికారి, గోస్పాడు జే.స్వప్నిక, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎంపీపీ నంద్యాల శెట్టి ప్రభాకర్, డీసీ చైర్మన్ ఇలియాస్, చాబోలు, టి.విశ్వనాథ రెడ్డి, మునగాల, తులసీశ్వర రెడ్డి, గోస్పాడు, కళ్యాణ్ కుమార్, ఊడుమాల్పురం, జోజి రెడ్డి, జయచంద్రా రెడ్డి, పోలూరు, చంద్రా రెడ్డి, రాయమల్పురం, భూపాల్ రెడ్డి, చాపిరేవుల, హనీఫ్, లాయర్ బాబు, కానాల,వ్యక్తిగత యంత్ర పరికరాల లబ్ధిదారులు, నంద్యాల నియోజకవర్గ రైతులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాగల 4,5 రోజుల్లో జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉరుములతో కూడిన వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, బహిరంగ ప్రదేశాలలో ఉండకూడదని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పొలాల్లో పనిచేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పని చేసే వారు, రైతులు, పశువుల కాపరులు, గొర్రెలు కాపరులు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని కలెక్టర్ సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

బీసీ గురుకులాల్లో వందశాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ గ్రామ సమీ పంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో చదివిన విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణతతో, అత్యధికంగా 588 మార్కులు సాధించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు ఛాలెంజ్గా నిలిచింది. పదవ తరగతిలో 76 మంది విద్యార్థులలో, పదవ తరగతి ఫలితాల్లో దాదాపు 39 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించి ప్రభంజనం సృష్టించారు. పదో తరగతి ఫలితాలు అనంతరం సర్వే ఆధారంగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో అత్యధికంగా 588 మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తూ బహుమానం అందజేయడంతో పాటు ప్రిన్సిపల్ యమునా దేవికి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యమునా దేవి మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులలో ఫెయిల్ అన్నా ప్రస్తావన దరిదపుల్లో రాకుండా ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పుతూ గౌరవప్రదంగా మెలిగే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. పదో తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి, బంగారు భవిష్యత్తుకు బాటలు వడే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పదో తరగతి, ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులు సాధించిన మాల దళిత విద్యార్థులకు అభ్యుదయ దళిత సేవా సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనం నందు ప్రతిభ పురస్కార అవార్డులు అందజేసినట్లు సీనియర్ ఉపాధ్యాయుడు ఏంసీ సుంకన్న తెలిపారు. మాల విద్యార్థులు పదో తరగతి నందు ఎండీ సాయి నందిని 596, సంకేత్ 585, రుత్వక్ సాయి 581, సూర్యతేజ 576, ఇంటర్మీడియట్ నందు రాఘవేంద్ర 958మార్కులతో ఇటీవల విడుదలైన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మీడియా రంగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన బహుజన మీడియా సంపాదకుడు, సామాజిక కార్యకర్త అయిన బూదూరు శ్రీనివాసులు డా.ఏపీజే అబ్దుల కలాం అవార్డు అందుకున్న సందర్భముగా విద్యా-ప్రతిభా పురస్కారాలు అందజేయడన్న జరిగిందన్నారు. సమావేశంలో అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు కళ్ళు పోతుల రంగన్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అభినందిస్తూ వారు భవిష్యత్తులో మరింత బాగా విద్యలో మంచి ప్రతిభ కనబరిచి మంచి స్థాయికి వెళ్లాలని ఆకాంక్షిం చారు. రిటైర్డ్ ఏసీటీఓసీ ఆర్.స్వామి మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకొని మరింత ముందుకు సాగాలని అదేవిధంగా అభినయ దళిత సేవా సంఘం మీ వెన్నంటే ఉంటుందని విద్యార్థులను ప్రోత్సహిం చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయ నాయకులు, తిక్క స్వామి వివిధ పార్టీల నాయకులు గంగాధర్, వీరేష్, ఐఎఫ్టియు నరసన్న, కుంకనూరు వీరేష్, బాలాజీ, కోదండ, బుజ్జప్ప, వన్నూర్ మాల కుల బంధువులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాను వర్తింపజేయాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఇచ్చిన మత్స్యకార భరోసా రాయలసీమ జిల్లాలకు వర్తింప జేయాలని జాతీయ మత్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు పట్టణంలోని మత్స్యకార సంఘం కార్యాలయంలో మత్స్యకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బెస్త శ్రీనివాసులు మాట్లాడుతూ ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు రాష్ట్రంలో చేపల వేట జరగకుండా వెయిటర్ నిషేధం విధిస్తారన్నారు. అందరికీ మత్స్యకార భృతి వర్తింప జేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ఇంగ్లాండ్ చెరువులపై ఆధారపడి జీవిస్తున్న మత్స్య కారులకు వేట నిషేధ సమయంలో భృతి చెల్లించకపోవడం, కూటమి ప్రభుత్వము రాయ లసీమ మత్స్యకాలను మోసం చేసినట్టేనని విమర్శించారు. ఇప్పటికైనా రాయలసీమ జిల్లాలోని మత్స్యకారులు కూటమి ప్రభుత్వ ద్వంద వైఖరిని పసిగట్టాలని, మోసపు వాగ్దానాలను నమ్మ వద్దని ఆయన సూచించారు. బెస్త సత్యనారాయణ, ఎద్దుల వెంకటేశ్వర్లు, బెస్త కమల, తెలుగు కన్నా, తెలుగు నందకిషోర్, తెలుగు నాగరాజు, తెలుగు మోహన్, కుల సంఘం పాల్గొన్నారు.